# ● తల్లి దీవెన!

'ఒరేయ్ దరిద్రపు వెధవా!

ఎక్కడ చచ్చావురా?'

తల్లి అరుపువిని గోడ ప్రక్కన దాక్కున్నాడు అమ్మాజీ సుపుత్రుడు మార్కండేయులు.

కొడుకు కోసం వెతికి వెతికి చివరికి వాడ్ని పట్టుకుని ఇంట్లోకి లాక్కు వచ్చింది ఆమె. "గోళీ కాయలు ఆడద్దని తోటి పిల్లలతో తగాదాలు తెచ్చుకోవద్దని ఎన్నిసార్లు చెప్పాను" అని వాణ్ణి చావబాదడం మొదలు పెట్టింది. అడ్డు వచ్చిన అత్తగార్ని విసుక్కుని "వెధవా! మధ్యాహ్నం దాకా నీకు తిండి పెడితే ఒట్టు" అంది.

"చూడమ్మా! పిల్లలు ఆడుకోవడం సహజం. వాడీ వయసులో కాకపోతే ఇంకెప్పుడు ఆడుకుంటాడు? కొడుకుని సరిగ్గా పెంచుకోవాలనే తాపత్రయం ప్రతి తల్లికీ వుంటుంది. వాడ్ని కేకలెయ్! అవసరమైతే రెండు కొట్టు. అంతే గానీ ఇరవై నాలుగు గంటలూ ఆ తిట్లేమిటి? గొడ్డుని బాదినట్టు ఆ కొట్టడం ఏమిటి? పిల్లల్ని దారిలో పెట్టే పద్ధతి ఇదేనా?" అత్తగారి మాటలకు తారాజువ్వలా లేచింది అమ్మాజీ—"గతిలేని వాళ్ళు గతిలేనట్టు పడుండాలి. నా కొడుకు చెడిపోయి చస్తే మీకేమిటి బాధ? ఎదుటి వాళ్ళకి నీతులెన్నయినా చెప్పొచ్చు."

కోడలికి సమాధానం చెప్పలేక ఊరుకుందావిడ. భర్త పోయాక కొడుకు దగ్గరికి చేరింది. మనవణ్ణి కోడలు హింస పెడుతూంటే చూడలేక ఏం చెయ్యలేక తనలో తనే బాధపడుతూంది. దానికి తగ్గట్టుగా మనవడు కూడా మొండివాడు, అల్లరివాడు కావడంతో అమ్మాజీకి అసలు చెప్పలేక పోతోందావిడ.

"ఒరేయ్ నాయనా! నన్ను నీ తమ్ముడి దగ్గరకు పంపెయ్‌రా! నీ పెళ్ళాం నీ కొడుకుని తిట్టే తిట్లు భరించలేక పోతున్నాను. నిన్ను గోదారి ఎత్తుకెళ్లా! నీ చావుని నేనెప్పుడు చూస్తానురా! దిక్కుమాలిన చావు ఛస్తావురా! ఇవీ అది తిట్టే తిట్లు. అవి వినలేక నా ప్రాణం గిలగిల లాడిపోతోంది" అంది కొడుకుతో తల్లి ఆ రాత్రి.

"నీది అంతా ఛాదస్తమేనే! తిడితే నిజమై పోద్దా ఏమిటి?" అన్నాడు కొడుకు విసుక్కుంటూ.

"మంచి దీవెన ఫలించక పోవచ్చుగానీ ఇలాటి తల్లి దీవెనలు మంచివి కావురా! నా పిచ్చి నాదనుకో! పసివాడిని ఆ తిట్లేమిటి? వాడు అల్లరి వెధవే! కాదనను. మెల్లగా చెప్పుకోవాలి. కొన్నాళ్ళకి వాడికే తెలుస్తుంది. అసలు వాడు అలా మొండి వాడెందుకు అయ్యాడు? ప్రతి చిన్న విషయానికీ కొట్టడం, తిట్టడం, తిండి పెట్టకుండా మాడ్చడం ఇలాగా పిల్లల్ని పెంచడం? నువ్వా ఏమీ మాట్లాడవు. అయినా మీ కొడుకు మీ ఇష్టం. నేను చెప్తే వింటారా? ఒక్కగా నొక్క కొడుకుని పెంచుకోలేని మీకు పది మందిని కనిపెంచిన నేను ఎందుకూ పనికిరాని దాన్నై పోయాను. నేను రేపే నూజివీడు వెళ్ళిపోతాను" నిక్కచ్చిగా చెప్పిందావిడ.



మర్నాడు కొడుకు తల్లిని బస్ ఎక్కించి వచ్చాడు.

"ఆ వెధవ ఎక్కడ చచ్చాడో! ముదనష్టపు వెధవ" అనుకుంది అమ్మాజీ. ఇంటికి రాని మార్కండేయుల్ని తలుచుకుని. ప్రొద్దుటనగా వాడు గూటీబిళ్ళ, కర్ర పట్టుకుని బయటికి పోయాడు. పన్నెండైనా రాలేదు.

"ఎందుకే ఆ తిట్లు? వాడు నీ కడుపున పుట్టిన బిడ్డే!" అని చెప్పడానికి అత్తగారు లేక పోవడంతో ఆమె నోటికి అడ్డు లేదు.

"కొట్టుకు పోయి వెచ్చాలు తీసుకు రావాల్రా అని చెప్పాను. వెధవ ఛస్తే పీడా పోయేది. చెప్పకుండా పోయాడు. రానీ వెధవని ముక్కలు ముక్కలు చేస్తాను" అని కడుగుతున్న గిన్నెల మీద తన కోపాన్ని చూపిస్తూ.

కానీ—గూటీ బిళ్ళని తేవడానికి పరిగెత్తి లోడెడ్ ట్రాక్టర్ క్రింద పడి ముక్కలైపోయిన మార్కండేయులు సంగతి ఇంకా తెలీదు అమ్మాజీకి.

— డి.వి.వి. సత్యనారాయణ

'సావిత్రి, రాజమండ్రి' అన్న పేరుతో వివిధ పత్రికల్లో (ఎక్కువగా 'ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రికలో) నిశితమైన లేఖలు రావడం పాఠకులకు జ్ఞాపకం వుండే వుంటుంది. ఆ సావిత్రి ఈ అక్టోబర్ 4వ తేదీన విశాఖలో సుదీర్ఘకాలం అస్వస్థత తర్వాత అంతిమశ్వాస విడిచారు. తన దేహాన్ని కింగ్‌జార్జి ఆస్పత్రికే ఇవ్వాలని ప్రకటించారు.

మృత్యు శయ్యపై వున్న ఆమె ఆఖరి సమీక్షను ప్రచురించింది కూడా ('మనలోమనం') 'ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రికే. స్త్రీ విముక్తి కోసం తహతహలాడిన సావిత్రి చివరి గడియల్లో కూడా ఆవిషయమై విపరీతమైన ఆశావాదిగానే వుండిపోయారు. వ్యక్తిగత జీవితంలో ఎన్ని సమస్యలూ, బాధలూ ముట్టుముట్టినా, సామాజిక జీవితం బాగుపడడం మీదనే తన ఆలోచనవీ, ఆచరణవీ నిలిపారు. ఆమె స్మృతికి...

## సావిత్రి....

"సావిత్రీ!"

"యమధర్మారాజా!"

"నీ నిజాయితీకి మెచ్చితిని...

..ఏదేని ఒక్క వరము కోరుకొనుము ప్రసాదించెదను."

"స్త్రీ విముక్తి ప్రసాదించండి స్వామీ!"

"అహో! అసాధ్యము! అది దక్క వేరొక్క వరము కోరుకొనుము."

"అయిన పురుషాధిక్యతా నాశనము స్వామీ!"

"అబలవనీ, క్షయరోగివనీ మిన్నకున్న పురుషుడవని మరచి నన్నునూ అవమానపరచుచుంటివా! అయిననూ నీ సాహసమునకు మెచ్చి ఒక్క వరమిచ్చెదను కోరుకొనుము. అదియునూ స్త్రీ విముక్తి దక్క..."

"యమధర్మరాజా!"

"ఏమి సావిత్రీ!"

"స్త్రీ విముక్తి ప్రసాదించలేని నీకు నేనే ఒక వరమిచ్చుచున్నాను స్వీకరించుడు"

"ఏమది సావిత్రీ?"

"నా విముక్తి స్వామీ! నా ప్రాణములే మీకు ప్రసాదించుచున్నాను..."

—శాంతకుమారి